ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు

TAMILNADU

శనివారం 19 జూలై 2025



## కేంద్రం వివక్షపై

# గళమెత్తండి

- డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం



అరివాలయంలో డీఎంకే ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యేళ్లతరబడి భాష, విద్య, నిధుల విషయంలో అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఉభయ సభల్లో గళమెత్తాలని డీఎంకే ఎంపీలకు ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానుండటంతో తేనాంపేటలోని అన్నా అరివాలయంలో శుక్రవారం ఉదయం లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల సమావేశం జరిగింది. పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ ఎంపీలు ఎలా ప్రవర్తించాలనే విషయమై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. గత 11 యేళ్లుగా రాష్ట్రాన్ని మోసగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించాలన్నారు. విద్య, వైద్య, ఆర్థిక సంబంధిత కీలకమైన అంశాలపై ఉభయ సభల్లోనూ ఎంపీలు చర్చ లేవదీయాలన్నారు. మే 24న ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో తాను ప్రస్తావించిన కావేరి, వైగై, తామ్రబరణి నదులను శుభ్రపరిచే పథకం గురించి, కేంద్రప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టే, అమలు చేసే పథకాలకు ఆంగ్లంలోనే పేర్లుపెట్టాలని తాను చేసిన ప్రతిపాదన గురించి కూడా డీఎంకే సభ్యులు మాట్లాడాలన్నారు. మహారాష్ట్రలో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడానికి ప్రయత్నించి అభాసుపాలైన కేంద్రప్రభుత్వం బీజేపీ అధికారంలో ఉందన్న కారణంగా ఆ రాష్ట్రానికి ఎస్ఎస్ఏ నిధులను పూర్తిగా విడుదల చేసి, రాష్ట్రానికి మాత్రం మొండి చేయిని చూపిందని స్టాలిన్ విమర్శించారు. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న సవతితల్లి ప్రేమను గురించి కూడా ఉభయ సభల్లో పాలకపక్షాన్ని నిలదీయాలన్నారు.

**ఆదాయానికి గండి...**

పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం ఆదాయాన్ని రాష్ట్రానికి సక్రమంగా విడుదల చేయకపోవడాన్ని కూడా పాలకపక్షం దృష్టికి తీసుకెళ్ళాలని స్టాలిన్ పేర్కొన్నారు. రాష్ట్రానికి చెల్లించాల్సిన ఉమ్మడి ఆదాయ వాటాను సక్రమంగా కేటాయించకుండా కేంద్రం గండి కొడుతోందన్నారు. 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదన మేరకు 41 శాతం నిధులు విడుదల చేయడానికి బదులుగా 33.16శాతం నిధులు మాత్రమే కేటాయించిన విషయాన్ని కూడా కేంద్ర దృష్టికి తీసుకెళ్ళాలన్నారు. కీళడి పురావస్తు తవ్వకాల ద్వారా తమిళుల ప్రాచీన నాగరికత మూడువేల సంవత్సరాలనాటిదని నిర్ధారణ అవుతున్నా కేంద్ర ప్రభుత్వం తవ్వకాలపై రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికలో మార్పులు చేయాలని నివేదికను తిప్పిపంపటం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలోడీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, డిప్యూటీ కార్యదర్శులు, ఎంపీలు కనిమొళి, తిరుచ్చి శివ, ఎ.రాజా, అందియూరు సెల్వరాజ్, ఆర్ఎస్ భారతి తదితరులు పాల్గొన్నారు.



టి.నగర్ జిఎన్‌శెట్టి వీధిలోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆడి శుక్రవారం సందర్భంగా నిర్వహించిన లక్ష్మీపూజలో పాల్గొన్న టీటీడీ స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షుడు శ్రీకృష్ణ, ఏఈఓ పార్థసారథి

# వైభవంగా ఆడి పూజలు

- తొలి శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి





ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెడుతున్న మహిళలు - నాగదేవతకు ప్రత్యేక పూజలు

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆడి తొలి శుక్రవారం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆడి నెల ప్రారంభంతోనే మిగతా పండుగలు కూడా వరుసగా ప్రారంభమవుతాయి. ఆడి తొలి శుక్రవారం సందర్భంగా తిరువేర్కాడులోని శ్రీదేవీ కరుమారియమ్మన్ ఆలయం, మాంగాడులోని కామాక్షి అమ్మన్ ఆలయం, మైలాపూర్ ముండకన్ని ఆలయం, నుంగంబాక్కం పుష్పానగర్‌లోని కరుమారియమ్మన్ ఆలయం, ప్యారీస్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం, తిరుముల్లైవాయల్‌లోని పచ్చయమ్మన్ ఆలయం, వాషర్‌మెన్‌పేట తురకానత్తర్ ఆలయం, టి.నగర్ ముప్పాత్తమ్మ ఆలయం, ప్యారీస్ తంబిచెట్టి వీధిలోని కాళికాదేవి ఆలయం, తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం భవాని అమ్మవారి ఆలయం, పుట్లూరులోని అంకాల పరమేశ్వరి ఆలయం సహా రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్లు కొలుదీరిన ఆలయాల్లో ముత్తైదువలు అమ్మవార్లకు కుంకుమార్చన, దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణాల్లో మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. అదేవిధంగా నాగదేవతలకు క్షీరాభిషేకం చేసి దోషాలు తొలగాలని ప్రత్యేక పూజలు చేశారు.

## కామరాజర్ వివాదం ముగిసింది

- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీముఖ్యమంత్రి కామరాజర్‌పై డీఎంకే నేత తిరుచ్చి శివ చేసిన వ్యాఖ్యల వివాదం ముగిసిందని, ఇకపై కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టొద్దని ఆదేశించినట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో కామరాజర్ నిజాయితీ, నిరాడంబరంగా వ్యవహరించిన విషయం అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎంపీ తిరుచ్చి శివ కామరాజర్ గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నిర్వాహకులు గురువారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై శుక్రవారం ఉదయం తేనాంపేటలోవున్న డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయానికి వెళ్ళి సీఎం స్టాలిన్‌ను కలుసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్న శ్రీపెరంబదూరులో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం సెల్వపెరుంతగై మీడియాతో మాట్లాడుతూ.. కామరాజర్ వివాదం గురువారం రాత్రితో ముగిసిందన్నారు. డీఎంకే కూటమి నుంచి కాంగ్రెస్‌ను విడగొట్టాలన్న దురుద్దేశంతో కొంతమంది రాజకీయ నాయకులు కామరాజర్ వివాదాన్ని అస్త్రంగా తీసుకున్నారని, కామరాజర్‌ను హత్యచేయాలని ప్రయత్నించిన వారే ఆయన జయంతి జరుపుకున్నారని తెలిపారు.



సీఎం స్టాలిన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సెల్వపెరుంతగై

# డీఎంకేని ఓడించడమే లక్ష్యం

- అన్ని పార్టీలూ ఏకం కావాలి
- ఎన్నికల వ్యూహాలు బయటకు చెప్పలేం...!
- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్



ఎడప్పాడి పళనిస్వామి

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకేను ఓడించాలనుకునే పార్టీలన్నీ ఏకే తాటిపైకి రావాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పిలుపునిచ్చారు. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో పొత్తుపై మాట్లాడుతూ.. ఎన్నికల వ్యూహాలు ఇప్పుడే బయటకు చెప్పలేమని ఆయన వ్యాఖ్యానించారు. పళనిస్వామి ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి మెజార్టీతో అన్నాడీఎంకే అధికారం చేపడుతుందన్నారు. 50 నెలల డీఎంకే పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల విక్రయాలు, హత్యలు, అత్యాచారాలు, నేరాలు అధికమయ్యాయని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్న ఇలాంటి ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో లేదన్నారు. మక్కల్ కాప్పోం...తమిళగ్గై మీడ్పోం అనే నినాదంతో ఈ నెల 7వ తేది నుంచి రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలు పర్యటించే కార్యక్రమం ప్రారంభించానని తెలిపారు. తను వెళ్లిన ప్రతి చోట ప్రజలు నీరాజనాలు పడుతున్నారని, ద్రావిడ మోడల్ పాలనతో విసిగిపోయిన ప్రజలు, అన్నాడీఎంకేకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తన ప్రచారంతో తెలిసిందని అన్నారు.

**పార్టీలో 46 ఏళ్లుగా...**

అన్నాడీఎంకే పార్టీలో 46 ఏళ్ల క్రితం తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా 'పురచ్చితలైవర్ ఎంజీఆర్, 'పురచ్చితలైవి' జయలలిత చూపిన బాటలో రాష్ట్రంలో మళ్లీ అన్నాడీఎంకేను అధికారంలోకి తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. పార్టీ కార్యకర్తలు కూడా ఇదే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. పార్టీలో ప్రస్తుతం 2 కోట్ల మంది సభ్యులున్నారని, సభ్యుల సంఖ్యలో దేశంలో మూడో అతిపెద్ద పార్టీగా, రాష్ట్రంలో తొలి పార్టీగా ఉన్న అన్నాడీఎంకే, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టడం తథ్యమన్నారు.

**కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం...**

అన్నాడీఎంకే ప్రాంతీయ పార్టీ అని, రాష్ట్రంలో అమలుచేసే పథకాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం కూడా తప్పనిసరి అన్నారు. జాతీయస్థాయిలో బీజేపీ అతిపెద్ద పార్టీగా ఉందని, ఈ పార్టీ నేతృత్వంలోని కూటమి కేంద్రంలో అధికారంలో ఉందన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలకు డీఎంకే ప్రభుత్వం కారణమన్నారు. ఒక కుటుంబం చేతిలో రాష్ట్ర అధికారం నిక్షిప్తమై ఉందని ఆరోపించారు.ఈ అసమానత ప్రభుత్వాన్ని గద్దె దించాలనే లక్ష్యంతోనే బీజేపీతో పొత్తు కుదుర్చుకోవాలని నిర్ణయించామని తెలిపారు. రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలు ఉంటాయన్నారు. డీఎంకేను గద్దె దించాలని లక్ష్యంతో ఉన్న పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఆ విషయం ప్రధాన అంశంగా తాము భావించలేదని తెలిపారు. దేశంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉండడంతో పాటు ఆ పార్టీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2024 ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీచేసి తమ బలాన్ని నిరూపించుకున్నామన్నారు. ఈ సారి డీఎంకేను ఓడించాలనే లక్ష్యంగా ఉన్నామని తెలిపారు. డీఎంకే కూటమిలోని డీపీఐ, వామ పక్షాలు, ఇతర పార్టీలు తమ కూటమిలోకి వస్తే స్వాగతిస్తామన్నారు. విజయ్ నేతృత్వంలోని పార్టీతో పొత్తు కుదుర్చుకునే పక్షంలో బీజేపీకి దూరమవుతారా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. తమ వ్యూహాలు తమకున్నాయని, వాటి గురించి ఇప్పుడే బయటకు చెప్పలేమన్నారు.

## నీలగిరి, కోవై సహా

## పది జిల్లాలకు భారీ వర్షసూచన

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీలగిరి, కోవై సహా పది జిల్లాల్లో శనివారం భారీవర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ ఆంధ్ర ప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతోంది. అలాగే, రాష్ట్రం మీదుగా వచ్చే పశ్చిమ గాలుల వేగంలో కూడా మార్పులున్నాయి. ఈ కారణంగా, శనివారం నుంచి ఈ నెల 22వ తేది వరకు రాష్ట్రంలోని ఉరుములు, పిడుగులతో మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే, కొన్ని ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, నీలగిరి, కోయంబత్తూర్ జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో అతి భారీ వర్షం, తేని, తెన్‌కాశి, కన్నియకుమారి, తిరునల్వేలి, తిరువళ్లూర్, రాణిపేట, వేలూరు, తిరువణ్ణామలై తదితర జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. రాజధాని నగరంలో చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములతోకూడిన తేలినపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని, పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## మాజీ ఎమ్మెల్యే సత్యపై ఏసీబీ పంజా

- బన్రుట్టి నివాసంలో సోదాలు

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి అక్రమార్జనకు పాల్పడ్డారనే ఆరోపణలపై అన్నాడీఎంకేకు చెందిన బన్రుట్టి మాజీ ఎమ్మెల్యే సత్యాపన్నీర్‌సెల్వం నివాసంలో శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. బన్రుట్టి బస్‌స్టేషన్ సమీపంలోని కామరాజర్ నగర్‌లో ఓ విలాసవంతమైన బంగళాలో సత్య నివసిస్తున్నారు. 2016 నుండి 2021 వరకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేగా వ్యవహరించారు. ఆమె భర్త పన్నీర్‌సెల్వం నగర పంచాయతీ అధ్యక్షుడిగా చేశారు. 2021లో మళ్ళీ బన్రుట్టిలో పోటీ చేసేందుకు అన్నాడీఎంకే అధిష్ఠానం అనుమతించలేదు. దీంతో పార్టీ నుండి వైదొలగుతున్నట్లు సత్య, ఆమె భర్త పన్నీర్‌సెల్వం ప్రకటించి కొన్నేళ్లపాటు పార్టీ కార్యకలాపాలకు దూరంగా వున్నారు. ఆ తర్వాత ఇద్దరూ మళ్లీ పార్టీలో చేరారు. సత్యకు పార్టీ మహిళా విభాగం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పదవి కూడా లభించింది. ఈ నెల 12న పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి బన్రుట్టిలో ప్రచార యాత్ర చేపట్టినప్పుడు సత్య, ఆమె అనుచరులు, పార్టీ శ్రేణులంతా ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో సత్య ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు సంపాదించారనే ఆరోపణలతో గురువారం ఉదయం 6.30 గంటలకు కడలూరు ఆరుగురు అవినీతి నిరోధక విభాగం అధికారుల కామరాజర్‌నగర్‌లో ఉన్న సత్యాపన్నీర్‌సెల్వం నివాసంలో ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. ఈ విషయం తెలియగానే అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు సత్య నివాసం ఎదుట గుమికూడారు. సత్య భర్తపై అక్రమాస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై గత యేడాది ఫిబ్రవరిలో సోదాలు జరిపారు. ఈ నేపథ్యంలో సత్య పై తాజాగా నమోదు చేసిన అక్రమార్జన కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు.



బన్రుట్టిలో ఏసీబీ అధికారులు వెళ్లిన బంగళా. ఇన్‌సెట్‌లో సత్యా పన్నీర్‌సెల్వం

## ప్రముఖ సినీ దర్శకుడు వేలు ప్రభాకరన్ మృతి



వేలు ప్రభాకరన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు, కెమెరామన్, నటుడు వేలు ప్రభాకరన్ (67) శుక్రవారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కొట్టివాక్కంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు శనివారం జరుగనున్నాయి. భౌతికకాయాన్ని వలసరవాక్కం, శ్రీకృష్ణ నగర్ 21వ వీధిలో ఉన్న ఆయన స్వగృహంలో సినీ ప్రముఖులు, ఆయన అభిమానుల సందర్శనార్థం ఉంచారు. 1989లో 'నాలయ మనిదన్' చిత్రం ద్వారా తమిళ చిత్రసీమకు దర్శకుడిగా పరిచయమయ్యారు. ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఆ తర్వాత అదిశయమనిదన్, అసురన్, రాజాకిళి, పురచ్చికారన్ వంటి పలు హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఒకవైపు దర్శకుడిగానేకాకుండా, మరోవైపు నటుడిగా కాదల్ కథై, కాదల్ డైరీ, పిజ్జా 34 సహా పది సినిమాల్లో రాణించారు. మే నెలలో విడుదలైన ఖజానా చిత్రంలో చివరిసారిగా నటించారు. ఇదిలావుండగా 2017లో 60 యేళ్ళ వయసులో తనకంటే సగం వయసున్న నటి షిర్లేదాస్‌ను వివాహం చేసుకుని ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఒరు ఇయ్యక్కునరిన్ కాదల్ డైరి' అనే చిత్రంలో షిర్లేదాస్ నటించడం గమనార్హం. తనకంటే సగం వయసున్న యువ నటిని ఆయన వివాహం చేసుకోవడం కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. కాగా, వేలు ప్రభాకరన్ మృతిపట్ల తమిళ సినిమా దర్శకుల సంఘం, నడిగర్ సంఘం ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## టీచర్లు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

- హింసాకాండకు దిగిన విద్యార్థులు
- స్కూలు బస్సులపై పెట్రోలు బాంబులతో దాడి
- తిరునల్వేలి జిల్లాలో ఘటన

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా వీరవనల్లూరు సమీపంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆగ్రహం చెందిన విద్యార్థులు ఆ పాఠశాల వాహనాలపై పెట్రోలు బాంబులతో దాడి చేశారు. మానాపరనల్లూరు ఉత్తర వీధికి చెందిన శంకరకుమార్ కుమారుడు శబరి కన్నన్ (15) ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 7న టీచర్లు తిట్టారంటూ శబరి కన్నన్ విషం తాగి స్కూలుకు వెళ్ళాడు. ఆ తర్వాత తరగతి గదిలో సొమ్మసిల్లిన అతడిని ఆస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స ఫలించక ఆ విద్యార్థి మృతి చెందాడు. శబరి ఆత్మహత్యను తట్టుకోలేక అతడి కుటుంబీకులు, బంధువులు ఆగ్రహంతో రాత్రి వీరవనల్లూరు పోలీసుస్టేషన్ ఎదుట రాస్తారోకో చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసు అధికారులు అక్కడికి వెళ్ళి ఆందోళన చేస్తున్న వారిని శాంతింపజేశారు. ఇదిలా ఉండగా శబరి కన్నన్ ఆత్మహత్య చేసుకోవడంపై గురువారం అర్ధరాత్రి ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వీరవనల్లూరు - వెల్లాంగుళి రహదారిలో ఉన్న ఆ పాఠశాల వాహనాలపై పెట్రోలు బాంబులతో దాడి చేశారు. సమాచారం అందుకున్న చేరన్‌మాదేవి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేసేందుకు పోరాడారు. ఈ సంఘటన స్థలంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



దగ్ధమవుతున్న స్కూలు బస్సు

## సమాచార దర్శిని

### రాష్ట్రంలో మరో వెయ్యి మినీ బస్సులు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న ఐదు నెలల్లో వెయ్యి మినీ బస్సులు నడపనున్నట్లు రవాణా శాఖ కమిషన్ తెలిపింది. ఈ మేరకు రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ... రాష్ట్రంలోని కుగ్రామాల నుంచి సమీపంలోని నగరాలకు మినీ బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,857 మార్గాలు గుర్తించి, వాటిలో 2,098 మార్గాల్లో మినీ బస్సులు నడుపుతున్నామన్నారు. మిగిలిన 539 మార్గాల్లో మరో వారం రోజుల్లో బస్సులు నడపనున్నామని తెలిపారు. అలాగే, రానున్న ఐదు నెలల్లో 1,000 మినీ బస్సులు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

### 27న డ్రైవర్, కండక్టర్ పోస్టులకు రాతపరీక్ష

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖలో డ్రైవర్, కండక్టర్ పోస్టుల భర్తీకి ఈ నెల 27వ తేది రాతపరీక్ష నిర్వహించనున్నారు. రవాణా శాఖ 2015 తర్వాత కొత్త నియామకాలు చేపట్టలేదు. డీఎంకే అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ)కి 685 మందిని నియమించారు. అలాగే, కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగాలు ఇస్తున్నారు. ప్రస్తుతం, 3,274 డ్రైవర్, కండక్టర్ పోస్టుల భర్తీకి మార్చిలో దరఖాస్తు స్వీకరణ జరిగింది. ఈ పోస్టులకు 20వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 27న చెన్నై సహా 15 ప్రాంతాల్లో రాతపరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21వ తేది నుంచి హాల్ టిక్కెట్లు అందజేయనున్నట్లు, ప్రశ్నాపత్రాలు అన్నా విశ్వవిద్యాలయం రూపొందించిందని అధికారులు తెలిపారు.

### స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు పదవులు దరఖాస్తు స్వీకరణ గడువు పెంపు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థల చట్ట సవరణ ప్రకారం, పట్టణ పంచాయతి, మున్సిపాలిటీ, కార్పొరేషన్ సభ్యుల నియామకం కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దివ్యాంగుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెల 31వ తేది వరకు పొడిగించామని, దివ్యాంగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

### సిరుసేరిలో మూడవ మెట్రో యార్డు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు రెండో ప్రాజెక్ట్‌లో భాగంగా మూడవ యార్డు ఏర్పాటుకు షోలింగనల్లూర్-సిరుసేరి మధ్య 30 ఎకరాలు ఎంపిక చేయనున్నట్లు సీఎంఆర్‌ఎల్ తెలిపింది. నగరంలో రెండో మెట్రో ప్రాజెక్ట్ మూడు మార్గాల్లో 116 కి.మీ మేర ఏర్పాటుకానుంది. పనులు పూర్తిచేసి 2027లో ఈ మార్గాల్లో రైళ్లు నడపాలని సీఎంఆర్‌ఎల్ నిర్ణయించింది. రెండో మెట్రోలో నడిపే రైళ్లకు మరమ్మతులు, శుభ్రం చేయడం తదితరాలకు మాధవరంలో రూ.284.51 కోట్లతో 48.89 ఎకరాలు, పూందమల్లిలో రూ.187.5 కోట్లతో 38 ఎకరాల్లో యార్డులు రూపొందుతున్నాయి. కాగా, మాధవరం, పూందమల్లి ప్రాంతాలు దూరంగా ఉండడంతో, సిరుసేరిలో మూడో యార్డు ఏర్పాటుచేయాలని నిర్ణయించిన సీఎంఆర్‌ఎల్, స్థల సేకరణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

### పళని ఆలయ హుండీలో 5 కిలోల బంగారం

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పళని ఆలయ హుండీ లెక్కింపులో చరిత్రలో లేని విధంగా అత్యధికంగా 5 కిలోల బంగారం వచ్చింది. దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయంలో గత 23 రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని కార్తికేయ మండపంలో గురువారం జరిగింది. భక్తులు రూ.2,81,16,256 నగదు, 5,005 గ్రాముల బంగారం, 11,438 గ్రాముల వెండి, 1,324 విదేశీ కరెన్సీ కానుకగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### వందే భారత్ రైళ్ల బుకింగ్‌లో కొత్త సదుపాయం

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలు బయల్దేరే 15 నిమిషాలు ముందు రిజర్వేషన్ చేసుకునేలా కొత్త సదుపాయం కల్పించారు. ఈ విషయమై దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ రైల్వే పరిధిలోని పలు మార్గాల్లో వందే భారత్ రైళ్లు నడుపుతున్నామన్నారు. ఈ రైళ్లలో ప్రయాణించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రయాణికులకు మరింత సౌకర్యంగా ఉండేలా రైలు బయల్దేరే 15 నిమిషాలకు ముందు ఖాళీ సీట్ల వివరాలు తెలుపుతామని, ఆ సీట్లు ప్రయాణికులు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు.ఈసౌకర్యం మంగళూరు సెంట్రల్-తిరువనంతపురం (నెం.20631), తిరువనంతపురం-మంగళూరుసెంట్రల్(నెం.20632),చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్(నెం.20627),నాగర్‌కోయిల్-చెన్నై ఎగ్మూర్ (నెం.20628), కోయంబత్తూర్-బెంగళూరు కంటోన్మెంట్ (నెం.20642), చెన్నై సెంట్రల్-విజయవాడ (నెం.20677). మంగళూరు సెంట్రల్-మడగావ్ (నెం.20646), మదురై-బెంగళూరు కంటోన్మెంట్ (నెం.20671) తదితర 8 వందే భారత్ రైళ్లకు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

### ఫినో బ్యాంక్ నుంచి కొత్త పొదుపు పథకం

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ సేవలను సులభతరం చేసేలా ఫినో పేమెంట్స్ బ్యాంక్ కొత్త పొదుపు ఖాతా ప్రవేశపెట్టింది. కస్టమర్లు ఈ ఖాతాను ప్రారంభించినవెంటనే లావాదేవీ జరుపటానికి వీలుంటుంది. ఈ లక్ష్యంతో ఫినో పేమెంట్స్ బ్యాంక్ 'గాటి' పేరుతో పొదుపు ఖాతాను ప్రవేశపెట్టింది. గాటి అంటే భారతీయ భాషల్లో వేగం లేదా వేగవంతమైనది అని అర్థమని ఆ బ్యాంక్ నేషనల్ హెడ్ దర్పణ్ ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ వాడకం అధికమవుతుండటంతో కస్టమర్లకు గాటి పొదుపుపథకాన్ని ఆ ఫోన్ ద్వారా సులువుగా కొనసాగించవచ్చన్నారు. 'ఫినో పే' కస్టమర్లు కూడా ఆ పొదుపు ఖాతాను నిర్వర్తించవచ్చునని, 18 యేళ్ల వయస్సు, 12 వతరగతి పాసైనవారు, స్వయం ఉపాధి కలిగి స్మార్ట్‌ఫోన్‌లున్నవారు ఈ ఖాతా ప్రారంభించడానికి అర్హులని తెలిపారు.

### 21 నుంచి కళాశాల విద్యార్థుల మధ్య 'ఏకతాటిపై తమిళనాడు' ప్రచారం

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'ఏకతాటిపై తమిళనాడు' అనే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదును డీఎంకే చేపట్టింది. ప్రతి బూత్ పరిధిలోని 30 శాతం మంది పార్టీ సభ్యులుగా ఉండేలా ఆయా ప్రాంత నేతలు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, 'ఏకతాటిపై తమిళనాడు' అనే కార్యక్రమం ప్రారంభించారు. అందులో భాగంగా స్టాలిన్ సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను పార్టీ సభ్యులుగా చేర్పించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలో, డీఎంకే విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులను సభ్యులుగా చేర్చే కార్యక్రమం ఈ నెల 21వ తేది నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని కోవైలో డీఎంకే విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజీవ్ గాంధీ ప్రారంభించనున్నట్లు ప్రకటన విడుదల చేశారు.

# స్వాగతిస్తూ లేఖ రాసిన విద్యార్థి

● వెతుక్కుంటూ వెళ్లిన కలెక్టర్

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 'వాన జల్లుల కోసం ఎదురుచూస్తున్న పంటపొలాల వలె మీ రాక కోసం ఎదురుచూస్తున్నాము మేడమ్' అంటూ తమిళంలో తనను స్వాగతిస్తూ లేఖరాసిన విద్యార్థిని నామక్కల్ జిల్లా కలెక్టర్ అతడు చదువుతున్న స్కూలుకెళ్లి ప్రశంసించిన సంఘటన చర్చనీయాంశమైంది. నామక్కల్ జిల్లా ఎరుమపట్టి ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి విజయ్ కొత్తగా ఆ జిల్లాకు కలెక్టర్ నియమితులైన దుర్గా మూర్తికి ఓ లేఖ రాశాడు. ఆ లేఖలో సాధారణ కుటుంబంలో జన్మించిన దుర్గామూర్తి ఎన్నో కష్టాలు పడి చదువుకుని, కలెక్టర్‌గా ఉన్నతస్థితికి వచ్చారని తెలుసుకుని తనకు సంతోషం కలిగిందని, కనుక ఒకసారి తమ పాఠశాలను సందర్శించాలని కోరుతూ 'వాన జల్లులకోసం ఎదురుచూస్తున్న పంటపొలాల వలె మీ రాక కోసం ఎదురుచూస్తున్నాము మేడమ్' అంటూ స్వదస్తూరితో ఆమెకు లేఖ రాశారు. దుర్గామూర్తి ఆ లేఖను చూసి ఎంతో సంతోషించారు. గురువారం ఉదయం ఆ పాఠశాలకు వెళ్లి తనకు లేఖ రాసిన విజయ్ ఎక్కడ అంటూ ప్రశ్నించారు. టీచర్లు కలెక్టర్‌ను పదో తరగతిలో ఉన్న విద్యార్థి విజయ్ దగ్గరకు ఆమెను తీసుకెళ్లారు. సిబ్బందితోపాటు తరగతి గదిలోకి వచ్చిన కలెక్టర్ దుర్గామూర్తి విజయ్ వద్దకు వెళ్లి తన వివరాలను ఎలా తెలుసుకున్నావని ప్రశ్నించగా, సోషల్ మీడియాలో తెలుసుకున్నట్లు బదులిచ్చాడు. ఆ తర్వాత విజయ్‌ని కష్టపడి చదివి తన లాగే ఉన్నత స్థితికి రావాలని చెప్పి ఓ కానుక అందజేసి, విద్యార్థులతో కూర్చుని మాట్లాడిన తర్వాత ఆమె వెళ్లారు. కలెక్టర్ స్కూలు రప్పించిన విజయ్‌ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రశంసలతో ముంచెత్తారు.



ఎరుమపట్టి స్కూలులో విద్యార్థితో మాట్లాడుతున్న నామక్కల్ జిల్లా కలెక్టర్ దుర్గామూర్తి

# పళ్లిపట్టు రిజర్వ్ ఫారెస్ట్‌లో చిరుత సంచారం



రిజర్వ్ ఫారెస్ట్‌లో సంచరిస్తున్న చిరుత పులి

తిరుత్తణి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు ప్రాంతంలో రిజర్వు ఫారెస్ట్ పరిధిలోవున్న గ్రామాల్లో చిరుతపులి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తిరుత్తణి నుండి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు వరకు విస్తరించివున్న దట్టమైన అడవులు, పర్వతశ్రేణులు, జంతువులతో పచ్చటి ప్రకృతి సౌందర్యం, రమణీయమైన వాతావరణాల మధ్య చిన్నచిన్న గిరిజన గ్రామాలు, తండాల ప్రజలు నివసిస్తుంటారు. ఈ నేపథ్యంలో, బుధవారం సాయంత్ర అడవిలో మేకలు కాసేందుకు వెళ్లిన ఐదుగురు చిరుతపులి కనిపించినట్లు గ్రామస్తులకు తెలిపారు. దీంతో బెంబేలెత్తిన గ్రామస్తులు తమ గ్రామ శివారు ప్రాంతాల్లోని నొచ్చిలి, కాపూరు కండ్రిగై, కాకులూరు, రంగరాజు కండిగై గ్రామాల్లో చిరుతపులులు సంచరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కాపూరు కండ్రిగై ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ సీసీ కెమెరాలో చిరుతపులి సంచరిస్తున్న వీడియో రికార్డు అయ్యింది. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు చిరుతపులిని పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు.

**ఊటీ సమీపంలో ...**

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని అడవీ ప్రాంతం నుంచి బయటకొచ్చిన చిరుతపులి శుక్రవారం తెల్లవారుజామున ఊటీ సమీపంలోని ఎడక్కాడు ప్రాంతంలో సంచరించింది. ఊటీకి వెళ్ళే మార్గంలోవున్న ఎడక్కాడు ప్రాంతంలో వంతెనపై చిరుత నడిచి రావడం అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో కనిపించింది. దీంతో ఆ సమయంలో అటు వెళ్లిన వాహనచోదకులు పులిని చూసి భయభ్రాంతులకు గురయ్యారు. వారిలో కొంతమంది వాహనాన్ని దిగి వంతెనపై నడిచివెళ్తున్న చిరుతను వీడియో తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం వైరలవుతుండటంతో ఎడక్కాడు పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు, పర్యాటకులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో, వాహనచోదకులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరకున్న ఫారెస్ట్ అధికారులు చిరుతపులి ఆనవాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అడవీ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లౌడ్ స్పీకర్ల ద్వారా హెచ్చరించారు. అడవులకు దగ్గర వున్న మార్గం గుండా వన్యమృగాలు సంచరించే అవకాశముందని అందువల్ల వాటి దగ్గరకు వెళ్లి ఫొటోలు, సెల్ఫీలు తీయరాదని సూచించారు.



వంతెనపై నడిచి వెళుతున్న చిరుతపులి

● ఎంపీ, ఎమ్మెల్యేల కేసుల వ్యవహారం...

### సమాచార కమిషన్‌కు హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాజీ, ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉన్న అవినీతి కేసుల వివరాలు అందించాలనే పిటిషన్‌పై 12 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర సమాచార కమిషన్‌కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) చెన్నై మండల న్యాయవాదుల విభాగం సంయుక్త కార్యదర్శి అదిత్య చోళన్ మద్రాసు హైకోర్టులో వేసిన పిటిషన్‌లో... రాష్ట్రానికి చెందిన మాజీ, ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన అవినీతి కేసుల వివరాలు అందించాలంటూ నవంబరులో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు దరఖాస్తు చేసుకున్నానని, అందుకు ఈ శాఖ నిరాకరించడంతో, రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీలు చేశానని తెలిపారు. కమిషన్ కూడా ఇప్పటివరకు వివరాలు తెలుపలేదని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కోరిన సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన న్యాయమూర్తి ఎన్.మాల నేతృత్వంలోని ధర్మాసనం, ఈ పిటిషన్‌పై 12 వారాల్లో ప్రతిస్పందించాలని ఉత్తర్వులు జారీచేసి, కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

### తిరువళ్లూరు ఎస్పీగా వివేకానంద శుక్లా



తిరుత్తణి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా నూతన ఎస్పీగా వివేకానంద శుక్లాను రాష్ట్రప్రభుత్వం బుధవారం నియమించింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఆయన తిరువళ్లూరులో బాధ్యతలను స్వీకరించారు.ఇంతకు ముందు ఎస్పీగా పనిచేసిన శ్రీనివాస పెరుమాళ్ మరోప్రాంతానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో వివేకానంద శుక్లా వచ్చారు.. ఈ క్రమంలో ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన వివేకానంద శుక్లాకు పలువురు రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇదిలా వుండగా, గతంలో తిరువళ్లూరు జిల్లాలో అదనపు ఎస్పీగా వివేకానంద శుక్లా పనిచేయడం గమనార్హం.

### రేపు టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా కార్యదర్శుల సమావేశం ఆదివారం జరుగనుంది. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. నటుడు విజయ్ కొత్తగా ప్రారంభించిన టీవీకే పార్టీ, మహానాడు, బూత్ కమిటీల మహానాడు, కార్యనిర్వాహక సమావేశం తదితరాలు నిర్వహించి కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో, ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశం ఆదివారం పనయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరగనుంది. పార్టీ సభ్యులను చేర్చేలా రూపొందించిన కొత్త యాప్‌ను పార్టీ అధ్యక్షుడు విజయ్ ఆవిష్కరించనున్నట్లు సమాచారం. కాగా, టీవీకే రెండవ మహానాడు ఆగస్టు 25న మదురైలో జరుగనున్న విషయం తెలిసిందే.

# రోడ్డు సదుపాయం కల్పించండి

● ఎంపీ కాళ్లపై పడి ప్రాధేయపడిన మహిళ

పెరంబూర్, జూలై18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ఏర్పాటుచేయాలని కోరుతూ ఓ మహిళ ఎంపీ కాళ్లపై పడి ప్రాధేయపడిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పొన్నలూరుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఎంపీ శశికాంత్ సెంథిల్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమానికి వచ్చిన ఆయన కారు దిగి పాఠశాల వైపు వెళ్తున్న సమయంలో హఠాత్తుగా ఓ మహిళ ఆయన కాళ్లపై పడింది. తమ ప్రాంతానికి రోడ్డు సదుపాయం కల్పించాలని అధికారులకు పలుమార్లు తెలిపినా ప్రయోజనం లేకపోయిందని, రాళ్లు తేలిన మార్గంలో వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయింది. ఈ విషయమై స్పందించిన మంత్రి, సమస్య సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించి, కార్యక్రమానికి హాజరయ్యారు.



ఎంపీ కాళ్లపై పడిన మహిళ

# లంచం తీసుకుంటూ ఎండోమెంట్ ఏసీ అరెస్ట్

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో ఓ ఆలయాన్ని హిందూ దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకునేందుకు రూ.1.5 లక్షలు లంచం పుచ్చుకున్న ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇందిరను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబత్తూరు రత్నపురిలోని సుబేదారు లేఅవుట్‌కు చెందిన సురేష్‌కుమార్ సూళూరు సమీపంలోని పాప్పంపట్టిలో ఉన్న తన భూమిలో ఆలయం నిర్మించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని హిందూ దేవాదాయశాఖకు మార్చాలని కోరుతూ సురేష్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. గత నెల ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాల్సిందిగా హిందూ దేవాదాయశాఖకు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో హిందూ దేవాదాయశాఖ కార్యాలయానికి వెళ్లిన సురేష్‌కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఇందిరను కలిసి కోర్టు ఉత్తర్వులను అమలుపరచాలని కోరారు. దీనికి ఆమె రూ.3 లక్షలు డిమాండ్ చేశారు. ఇందుకు ఇష్టపడని సురేష్ కుమార్ ఆమెపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచన మేరకు రసాయనం కలిపిన రూ.1.5 లక్షలు సురేష్‌కుమార్ నుంచి తీసుకుంటుండగా ఇందిరాను ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం కోర్టులో హాజరుపరిచి ఆమెను రిమాండ్‌కు తరలించారు.



పట్టుబడ్డ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇందిర

# గ్రాండ్ చెన్నైలో 'తలైవన్ విరుందు 3.0'

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆహార ప్రియుల చవులూరించేలా గ్రాండ్ చెన్నైలో ప్రముఖ చెఫ్ పద్మశ్రీ డాక్టర్ దాము నేతృత్వంలో 'తలైవన్ విరుందు 3.0' పేరుతో విందు ఏర్పాటైంది. జీఆర్టీ హోటల్స్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన ఈ ప్రత్యేక విందు పది రోజుల పాటు కొనసాగనుంది. ఔత్సాహికులు 044- 281 50500 నెంబరుకు ఫోన్ చేసి రిజర్వ్ చేసుకోవచ్చు. పాకశాస్త్ర ప్రావీణుడైన చెఫ్ దాము వివిధ రకాల సంప్రదాయ తమిళ వంటకాలను రుచి చూపిస్తున్నారు. గురువారం జరిగిన ప్రారంభోత్సవంలో చెఫ్ దాముకు జీఆర్టీ హోటల్స్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ శీతలాం ప్రసాద్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమిళ వంటకాలపై చెఫ్ దాముకు వున్న పరిజ్ఞానం, వారసత్వాన్ని కాపాడుకోవాలనే ఆయన మక్కువ స్ఫూర్తిదాయకమని, ఆయనకు మరోసారి ఆతిథ్యం ఇవ్వడం తాము గౌరవంగా భావిస్తున్నామన్నారు.



చెఫ్ దామును సత్కరిస్తున్న హోటల్ నిర్వాహకులు

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**చింతాద్రిపేట:** చింత్రాదిపేట, వెంకటేశ గ్రామణి వీధి, సామినైకెన్, ఇయ్యముదాలి, వాలర్స్ రోడ్డు, సింగన్నచెట్టి వీధి, అరుణాచలం వీధి, కృష్ణప్ప చెట్టి, పుదుపేట, ఈసీఆర్ ఏరియా, ఎల్లీ రోడ్డు, నారాయనైయాకెన్, వీరభద్ర వీధి, హారిస్ వీధి, వెస్ట్ కూవం వీధి, పాంథియన్ రోడ్డు.

**పోరూర్:** అన్నైకాట్టుచేరి, అముదురమేడు, తిరుమనం, కావల్‌చేరి, వాయననల్లూర్, సోరన్‌చేరి, ఓలిచేరి, చిత్తకాడు. **తిరుముడివాక్కం:** కుండ్రత్తూర్, తిరుముడివాక్కం ఇండస్ట్రియల్ ఎస్టేట్, తిరుముడివాక్కం గ్రామం, పళన్‌తండలం, ఎరుమైయూర్, సోమంగళం, నడువీరపట్టు, వరాటరాజపురం, పూతండలం, పుదుపేరు, పెరియార్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, కుండ్రత్తూర్ బజార్, సంబంధం నగర్, వాళుతలంబేడు. **తిరుముల్లైవాయల్:**పోదూర్,పొక్కిసం భూమి నగరం కన్నడపాళయం, శివ గార్డన్, చెల్లి అమ్మన్ నగర్, లక్ష్మీనగర్, ఆర్‌కేజేవిలైవేల్‌నగర్,తాయ్ నగర్.

**పెరుంగుడి:** అరింజైర్ అన్నానగర్, వెంకటేశ్వర నగర్, పాండియన్ నగర్, కెనాల్ రోడ్డు, జైన్ కాలేజ్ రోడ్డు. **వేళచ్చేరి:** వెంకటేశ్వర నగర్, ఎంజీఆర్ నగర్, బైపాస్ రోడ్డు, దేవికరుమారియమ్మన్ నగర్, శశి నగర్, పద్మావతి నగర్, మురుగు నగర్, విజయ నగర్, గంగై నగర్, భువనేశ్వరి నగర్, రామ్ నగర్, నెహ్రూ నగర్, దండీశ్వరం నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, 100 అడుగుల రోడ్డు, రాజలక్ష్మి నగర్, జగన్నాథపురం, తిరువపతి అమ్మన్ ఆలయం, తాన్సీ నగర్, గాంధీ వీధి, వీజీపీ సెల్వ నగర్, సీతారామ్ నగర్, భువనేశ్వరి నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, తరమణి, బేబి నగర్.

# సెల్ఫీ మోజుతో యువకుడి బలి

● జలపాతంలో కొట్టుకుపోయి మృతి

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్ ఓరావి జలపాతం వద్ద హఠాత్తుగా పెరిగిన నీటి ఉధృతిలో చిక్కుకుని మదురైకి చెందిన యువకుడు మృతిచెందాడు. కొడైకెనాల్ నుంచి పళనికి వెళ్లే మార్గం పేత్తుపారై సమీపంలో ఓరావి జతపాతం ఉంది. ఏడాది పొడవునా ఈ జలపాతంలో నీరు ప్రవహిస్తుండగా, ఈ జలపాతాన్ని వీక్షించేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఘటన జరిగిన రోజు మదురైకి చెందిన 9 మంది విహారయాత్ర కోసం ఓరావి జలపాతానికి వచ్చారు. ఆ సమయంలో జలపాతం వద్ద నీటి ఉధృతి పెరిగింది. నీటి ఉధృతిలో సెల్ఫీ తీసుకొనేలా బండరాయిపై నిలబడిన మదురై విల్లాపురం ప్రాంతానికి చెందిన భరత్ (25) నీటిలో కొట్టుకుపోయాడు. స్నేహితులు, గ్రామ ప్రజలు అతని కోసం గాలించి మూడు గంటల తర్వాత మృతదేహం కనుగొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కొడైకెనాల్ పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### ఏనుగు దంతం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో ఏనుగు దంతం విక్రయించేందుకు యత్నించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వత్తలగుండు ప్రాంతంలో కొందరు ఏనుగు దంతం విక్రయిస్తున్నట్లు అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న సురుళివేల్, రాధాకృష్ణన్, భాస్కర్ తదితరులను అదుపులోకి తీసుకుని, వారి బ్యాగు పరిశీలించి అందులో ఏనుగు దంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దంతం ఎక్కడి నుంచి తెచ్చారు? ఎవరికి విక్రయిస్తున్నారు? అనే కోణాల్లో అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

### విద్యార్థినికి లైంగిక వేధింపులు

● ముగ్గురు విద్యార్థులపై పోక్సో కేసు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్లస్ వన్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ముగ్గురు విద్యార్థులపై పోక్సో కేసు నమోదైంది. కన్నియాకుమారి జిల్లాలోని ఓ ప్రాంతంలో ఉన్న పాఠశాలలో చదవుతున్న ప్లస్ వన్ విద్యార్థినికి అదే పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. వారి వేధింపులు తట్టుకోలేక బాధిత విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేసింది. వారు నాగర్‌కోయిల్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదుచేశారు. వారిలో ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి పాళయంకోటలోని జువైనల్ హోంకు తరలించి, పరారీలో ఉన్న మరో విద్యార్థి కోసం గాలిస్తున్నారు.

### మాజీమంత్రి వీరమణి పిటిషన్ తోసివేత

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కేసుకు సంబంధించి అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి కేసీ వీరమణి దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరుప్పూర్ జిల్లా జోలార్‌పేట నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరుపున కేసీ వీరమణి పోటీ చేశారు. ఆయన రిటర్నింగ్ అధికారికి సమర్పించిన నామినేషన్ పత్రంలో ఆస్తుల వివరాలను తక్కువగా చూపించారంటే వేలూరు చెందిన రామ్మూర్తి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తిరుపత్తూరు ప్రిన్సిపల్ సెసెన్స్ కోర్టులో తనకు వ్యతిరేకంగా ఈసీ తరుపున దాఖలు చేసిన పిటిషన్ రద్దు చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో కేసీ వీరమణి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం తిరుపత్తూరు కోర్టు విచారణకు స్టే విధించింది. ఈ కేసు మళ్లీ శుక్రవారం విచారణకు రాగా, ఈసీ తరుఫున వీరమణి ఆస్తుల వివరాలను పూర్తిగా తెలియజేయకుండా దాచిపెట్టారని ఆయనపై చర్యలు తీసుకోవాలని వాదించారు. ఈ వాదనను అంగీకరించిన న్యాయస్థానం కేసీ వీరమణి పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

### నామక్కల్‌లో కిడ్నీ చోరీ

● ఆస్పత్రికి ఆరోగ్య శాఖ నోటీసు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లో జరిగిన కిడ్నీ చోరీకి సంబంధించి ఆస్పత్రికి ఆరోగ్యశాఖ నోటీసులిచ్చింది. పాళయంకోటకు చెందిన చేనేత కార్మికుడు పేదరికం కారణంగా డబ్బు ఆశ చూపి కిడ్నీ తీసుకున్నట్లు ఫిర్యాదులందాయి. ఈ విషయమై సంబంధిత ప్రైవేటు ఆసుపత్రికి ఆరోగ్య శాఖ నోటీసు జారీచేసింది. అలాగే, జిల్లాలోని కిడ్నీ దాతల వివరాలపై విచారించాలని జిల్లా కలెక్టర్, ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

బాలికపై అత్యాచారం కేసు..

### ఏడుగురికి జీవిత ఖైదు

పెరంబూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో బాలికపై అత్యాచారం కేసులో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. కోవైలో ఓ ప్రాంతానికి చెందిన బాలిక 2019 నవంబరులో తన స్నేహితుడితో మాట్లాడుతున్న సమయంలో, అక్కడకు వచ్చిన ఏడుగురు వ్యక్తులు ఆ యువకుడిపై దాడిచేసి, బాలికపై అత్యాచారం జరిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసు కోవై కోఫ్సో కోర్టులో విచారణ జరుగుతుండగా, వాదోపవాదాలు, సాక్షుల విచారణ పూర్తికావడంతో, నిందితులు మణికంఠన్, ఆటో మణికంఠన్, కార్తీక్, రాహుల్, ప్రకాష్, నారాయణమూర్తి, కార్తికేయ తదితరులకు గురువారం న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు.

### పాఠశాల తాగునీటి తొట్టెలో మానవ వ్యర్థాలు

● ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ సమీపంలోని కార్యంకుడి గ్రామంలో పాఠశాల తాగునీటి తొట్టెలో ఇటీవల మానవ వ్యర్థాలు కలిపిన ముగ్గరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరువారూర్ సమీపంలోని ఈ పాఠశాలలో ఉదయం అల్పాహార పథకం అమలులో ఉంది. విద్యార్థులకు అల్పాహారం తయారుచేసేందుకు ఈ నెల 14వ తేదీ ఉదయం వంట సిబ్బంది రాగా, వంట గదిలో చల్లాచెదురుగా పడివున్న వస్తువులను చూసి పాఠశాల హెచ్‌ఎంకు సమాచారం తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పాఠశాల ప్రాంగణంలో చెట్లను నరకడం, నీటితొట్టెలో మానవ వ్యర్థాలున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు అదే ప్రాంతానికి చెందిన విజయరాజ్, సెంథిల్, కాళిదాస్ అనే ముగ్గురు దీనికి పాల్పడినట్లు నిర్ధారించి శుక్రవారం వారిని అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రైల్వే మాజీ అధికారి నివాసంలో

### రూ. కోటి నగదు, నగల చోరీ

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం వేల్స్ గార్డెన్ రోడ్డులో మాజీ రైల్వే అధికారి నివసిస్తున్న ఓ ఫ్లాట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.కోటి నగదు, విలువైన నగలను దోచుకెళ్ళారు. ఈ మేరకు ఆ మాజీ రైల్వే అధికారి థౌజెండ్ లైట్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఫ్లాట్‌లో తనిఖీ చేయగా, దొంగలు ప్రవేశించిన ఆనవాళ్లేవీ కనిపించలేదు. దీంతో ఇంటిలోని వ్యక్తులెవరో నగదు, నగలను అపహరించుకెళ్ళి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వేలిముద్రల నిపుణులను రప్పించి బీరువా తదితర ప్రాంతాల్లో వేలిముద్రలను సేకరించారు. గత వారం రోజులుగా ఆ ఫ్లాట్‌లోకి వచ్చినవాళ్ళ వివరాలను తెలుసుకుంటున్నారు.

### మావోయిస్టు రూపేష్‌కు జీవిత ఖైదు

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ చిరునామా వినియోగించి సిమ్ కార్డ్ పొందిన మావోయిస్టు దళానికి చెందిన రూపేష్‌కు జీవిత ఖైదు, రూ.31వేల జరిమానా విధిస్తూ శివగంగ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. కేరళ జైలులో ఉన్న రూపేష్‌ను శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు నడుమ శివగంగ కోర్టులో హాజరుపరిచారు. 8 సెక్షన్ల కింద నమోదుచేసిన కేసులో, నేరాలు రుజువుకావడంతో అతడిని కోర్టు దోషిగా ప్రకటించింది. రూపేష్‌పై కోయంబత్తూర్, మదురై, తిరుప్పూర్ సహా పలు జిల్లాల్లో 16 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

### కలైంజర్ సాధికారిక నగదు కోసం 30 వేలమంది దరఖాస్తు

చెన్నై,జూలై18(ఆంధ్రజ్యోతి): కలైంజర్ మహిళా సాధికారిక నగదు పథకం కింద రూ.1000ల సాయంకోసం 30వేలమంది గృహిణులు దరఖాస్తు చేశారు. గత నాలుగు రోజులుగా 'ఉంగలుడన్ స్టాలిన్' పేరుతో జరిపిన శిబిరాలలో కొడుంగయూరు, మనలి సహా ఆరు ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాలలో మొత్తం 42వేల దరఖాస్తులురాగా వాటిలో కలైంజర్ నగదు పథకం కోసం వచ్చిన దరఖాస్తులు 30వేల వరకూ ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.


ఆడియో రిలీజ్ దృశ్యం

# కులాన్ని ద్వేషిస్తూ సినిమా తీయడం ద్రోహం

● పేరరసు

ఒక కులాన్ని ద్వేషిస్తూ, కించపరుస్తూ సినిమా తీయడం ద్రోహమని ప్రముఖ సినీ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు పేర్కొన్నారు. తాజాగా నగరంలో జరిగిన 'సెంట్రల్' ఆడియో విడుదల కార్య క్రమంలో పేరరసు, సినీ దర్శకులు ఆర్వీ ఉదయకుమార్, కేఎస్ రవికుమార్, డ్రమ్స్ శివమణి సహా చిత్ర బృందం పాల్గొన్నారు. ముందుగా పేరరసు మాట్లాడుతూ,'సెంట్రల్' ఒక కులానికి చెందిన చిత్రంగా ముద్ర వేయొద్దని, అసలు ఒక కులానికి వ్యతిరేకంగా, ఆ కులాన్ని ద్వేషిస్తూ సినిమా తీయడం ద్రోహం' అని అన్నారు. ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'పేరరసు నిజంగానే ఒక విలన్. ఇపుడు సినిమాలో ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. సినిమా కళాకారులు రాజకీయాల్లోకి రాకూడదని చెప్పడానికి ఏ ఒక్కరికి అర్హత, అధికారం లేదు. ఈ సినిమాలో హీరో విఘ్నేష్ చాలా సహజంగా నటించారంటూ చిత్ర బృందానికి శుభాకాంక్షలు' తెలిపారు. కేఎస్.రవికుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ట్రైలర్, పాటలను చూస్తుంటే భావోద్వేగానికి గురి చేస్తున్నాయి. పేరరసు ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయనను అభినందించేందుకే ఈ కార్యక్రమానికి హాజరైనట్టు తెలిపారు. ఇదిలాఉండగా 'సెంట్రల్' చిత్రం శ్రీ రంగనాథన్ మూవీ మేకర్స్ పతాకంపై వి.దేవరాజ్, సదా కుమారగురు, తమిళ్ శివలింగం నిర్మాణంలో భారతి శివలింగం దర్శకత్వంలో రూపుదిద్దుకుంది. పేరరసు ఒక ముఖ్య పాత్రను పోషించగా, విఘ్నేష్, సోనేశ్వరి హీరోహీరోయిన్లుగా నటించారు. ఇతర పాత్రల్లో దర్షన్, ఆరు బాలా, రాజా, అన్బు రాణి, కవినిలవన్, ఓం గణేష్ తదితరులు పోషించారు.

## ఎం.ఎస్.భాస్కర్ ప్రధాన పాత్రలో కొత్త చిత్రం

ప్రముఖ నటుడు ఎం.ఎస్.భాస్కర్, ఫ్రాంక్‌స్టార్ రాహుల్ ప్రధాన పాత్రల్లో నటించే కొత్త చిత్రం పూజా కార్యక్రమం తాజాగా నగరంలో జరిగింది. కుట్టి స్టోరీస్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత భువనేష్ చిన్నస్వామి నిర్మించే ఈ చిత్రానికి ఫ్రాంక్‌స్టార్ రాహుల్ దర్శకుడు. కోలీవుడ్‌కు కమేడియన్‌గా పరిచయమైన ఫ్రాంక్‌స్టార్ రాహుల్ తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపడుతూ, ఓ కీలక పాత్ర కూడా పోషిస్తున్నారు. ఇతర పాత్రల్లో నటి స్నేక, అరుల్‌దాస్, మునీష్‌కాంత్, శ్రీనాథ్, శివ అరవింద్, ప్రియదర్శిని, అంజలి రావ్, అభినయ తదితరులు పోషిస్తున్నారు. కామెడీ విత్ హార్రర్ ఫాంటసీ మూవీగా రూపొందిస్తున్నట్టు నిర్మాతలు మెట్రో మురళి, మెట్రో గిరి వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభోత్సవంలో అనేక మంది సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.


కొత్త చిత్రం పూజా దృశ్యం

చిత్రజ్యోతి

## రేక్లా పోటీల నేపథ్యంలో 'చోళనాట్టన్'

రేక్లా పోటీల నేపథ్యంలో 'చోళనాట్టన్' పేరుతో ఓ చిత్రం రూపుదిద్దుకోనుంది. ముంబైలో స్థిరపడిన తమిళనాడుకు చెందిన చెందిన పారిశ్రామికవేత్త మారియప్పన్ ముత్తయ్య నిర్మాతగా సెవెన్ హిల్స్ మూవీస్ పతాకంపై తెరకెక్కించనున్నారు. ఇందులో ఉదయ్ కార్తిక్, లుథుఫ్, సౌందర్ రాజన్, సీత, భరణి, విఘ్నేష్ తదితరులు నటించారు. ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. 'పట్టుక్కోట' ఫేం రంజిత్ ఖన్నా దర్శకుడు. గతంలో దివంగత నటుడు విజయకాంత్ నటించిన 'ఉళవన్ మగన్' సినిమా తర్వాత పూర్తిస్థాయిలో క్రీడా నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనుంది. మదురై, తిరునెల్వేలి ప్రాశస్త్యాన్ని వివరిస్తూ అనేక సినిమాలు వచ్చాయి కానీ తంజావూరు, చోళరాజుల గొప్పతనాన్ని తెలియజెప్పేలా సినిమాలు పెద్దగా రాలేదని, అందుకే తంజావూరు ప్రాశస్త్య, రేక్లా పోటీల నేపథ్యంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్టు నిర్మాత ముత్తయ్య తెలిపారు. సినిమా గురించి దర్శకుడు వివరిస్తూ, 'తంజావూరులో ఈ కథ ప్రారంభమై చెన్నైలో కొనసాగుతుంది. కేవలం రేక్లా పోటీలపైనేకాకుండా, గిరిజనుల కష్టనష్టాలను వివరిస్తూ స్క్రిప్టు సాగుతుంది. ఒక ప్రముఖ నటుడు ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. ఆయన ఎవరన్నది ఇప్పటివరకు సస్పెన్స్. అని పేర్కొన్నారు.


'చోళనాట్టన్'లో ఓ దృశ్యం

## పెళ్ళిపీటలెక్కనున్న ఇద్దరు హీరోయిన్లు


తాన్య రవిచంద్రన్

కోలీవుడ్‌కు చెందిన ఇద్దరు హీరోయిన్లు పెళ్ళిపీటలెక్కనున్నారు. ఈ విషయాలను వారే తమ తమ సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. వీరిలో ఒకరు రిత్విక కాగా, మరొకరు తాన్య రవిచంద్రన్. 'కబాలి', 'పరదేశి', 'మద్రాస్', 'ఒరు నాల్ కూత్తు' వంటి అనేక చిత్రాల్లో నటించిన రిత్విక.. బిగ్‌బాస్ విజేత కూడా. వినోద్ లక్ష్మణన్ అనే యువకుడిని వివాహం చేసుకోనున్నారు. అలాగే, ప్రముఖ నటుడు రవిచంద్రన్ మనవరాలు, 'కరుప్పన్', 'నెంజుక్కు నీది', 'అఖిలన్', 'రసవాది' వంటి చిత్రాల్లో నటించిన తాన్య రవిచంద్రన్.. చిత్రపరిశ్రమలో కెమెరామెన్‌గా రాణిస్తున్న గౌతమ్‌ను వివాహం చేసుకోనున్నారు. పైగా తనకు కాబోయే భర్తతో ఆమె లిప్‌లాక్‌తో ఫొటో దిగి దాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇది సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.


కాబోయే భర్తతో రిత్విక

## 159 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో మూలకొత్తలం కార్పొరేషన్ జోన్ పరిధిలో నివసిస్తున్న 150 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు ఉత్తర్వులను శుక్రవారం ఉపముఖ్యమంత్రి ఉదయనిధి అందజేశారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని మూలకొత్తలంలో సీఎండీఏ ఇళ్లులేని కుటుంబాల వివరాలు సేకరించి రాష్ట్రప్రభుత్వం అనుమతులతో క్వార్టర్లు నిర్మిస్తోంది. ఆ రీతిలో బేసిన్ బ్రిడ్జ్, రాయపురం, పాలడిపో ప్రాంతాల కుటుంబంలోని లబ్దిదారులకు డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇంటి తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక పరిపాలనాశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, చిన్న,మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి టీఎం.అన్బరసన్, సీఎండీఏ ఛైర్మన్, దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు, కార్పొరేషన్ మేయర్ ప్రియ, టీఎన్‌ఈబీ అడిషనల్ ప్రిన్సిపల్ కార్యదర్శి కాకర్ల ఉషా, ఎమ్మెల్యేలు, జోన్ ఛైర్మన్‌లు, కౌన్సిలర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


లబ్దిదారులతో డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, శేఖర్‌బాబు తదితరులు

## కీల్పాక్ వాడెల్స్ రోడ్డుకు బిషప్ ఎస్రా సర్గుణం పేరు

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన క్రైస్తవ మతాధిపతి దివంగత బిషప్ ఎస్రా సర్గుణం మానవాళికి అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన నివసించిన కీల్పాక్ ప్రాంతంలోని వాడెల్స్ రోడ్డుకు బిషప్ ఎస్రా సర్గుణం రోడ్డు అనే పేరుపెట్టనున్నట్లు గతేడాది సీఎం స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం ఆ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన కొత్త నేమ్‌బోర్డును నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, శాసనసభ్యుడు ఎస్ ఇనికో ఇరుదయరాజ్, కార్పొరేటర్ వసంతిపరమశివం తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి కేఎన్ నెహ్రూ నగరంలో జీసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనులను పరిశీలించారు. అనంతరం సెంట్రల్ స్టేషన్ సమీపంలో ఉన్న విక్టోరియా హాలు పునర్నిర్మాణ పనులను కూడా పరిశీలించారు.



కీల్పాక్‌లో బిషప్ ఎస్రా సర్గుణం రోడ్డు నేమ్‌బోర్డు ఆవిష్కరిస్తున్న నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ


చెన్నై అరుంబాక్కంలోని ప్రభుత్వ యోగా సహజసిద్ధ వైద్యకళాశాలలో శుక్రవారం వక్షోజ క్యాన్సర్, హృదయ ఆరోగ్యంపై నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న మహిళలు

## 'ఇంటర్ - హాస్పిటల్ స్వాప్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్' విజయవంతం

చెన్నై, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే తొలిసారిగా కోవైలోని జెమ్ హాస్పిటల్ - శ్రీ రామకృష్ణ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్ - హాస్పిటల్ స్వాప్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్' విజయవంతమైంది. ఈ వివరాలను జెమ్ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సి.పళనివేలు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రవీణ్ రాజ్, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్‌లు డాక్టర్ ఆనంద్ విజయ్, డాక్టర్ మాగ్నస్ జయరాజ్, శ్రీరామకృష్ణ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ సుందర్, డైరెక్టర్ డాక్టర్ ఎస్.అళగప్పన్, కాలేయ మార్పిడి సర్జన్ డాక్టర్ ఆర్.జయపాల్ శుక్రవారంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సేలంకు చెందిన 59 ఏళ్ల వ్యక్తి, శ్రీరామకృష్ణ హాస్పిటల్‌లో చేరిన తిరుప్పూర్‌కు చెందిన 53 ఏళ్ల వ్యక్తికి ఒకేసారి కాలేయ మార్పిడి అవసరమైంది. వారి భార్యలు కాలేయదానం చేయడానికి సిద్ధమయ్యారు. కానీ రక్త గ్రూపు అననుకూలత కారణంగా అది సాధ్యం కాలేదు. అదే సమయంలో రక్తగ్రూపు కారణంగా ఒకరి సతీమణి కాలేయం మరొకరికి పరస్పరం సరిపోతున్నట్లు తేలింది. 'స్వాప్ ట్రాన్స్‌ప్లాంట్' (ప్రతి రోగి యొక్క దాత మరొకరికి ఇచ్చేది) ఆచరణీయం కావడంతో ఈ నెల 3వ తేదీ రెండు ఆస్పత్రుల్లో ఒకేసారి శస్త్రచికిత్స నిర్వహించారు. బంధువు రోగికి నేరుగా దానం చేసే సాంప్రదాయ జీవన దాత కాలేయ మార్పిడిలా కాకుండా, స్వాప్ ట్రాన్స్‌ప్లాంట్ వారి సొంత కుటుంబంలో అనుకూలమైన దాత లేని రోగులు ఇలాంటి పరిస్థితిలో మరొక కుటుంబంతో దాతలను మార్పిడి చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ విధానంతో రెండు ఆస్పత్రుల్లో రోగులకు కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేశారు. దేశంలోనే ఇలాంటి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స జరగడం ఇదే ప్రథమమని వైద్యులు పేర్కొన్నారు. రోగులు పూర్తిగా కోలుకున్నట్లు వారు వివరించారు.


మీడియా సమావేశంలో వైద్య బృందం

తరుణి

బాల్యంలోనే ఆమెలో ఏర్పడిన బీజం పెరిగి మహా వృక్షమై మదర్ ఇండియా క్రోషెటింగ్ క్వీన్ అనే సంస్థ పురుడు పోసుకుంది. ఏకంగా ఆరు గిన్నిస్ రికార్డులు సాధించి, దేశ విదేశాల్లో దాదాపు రెండున్నరవేల మందికి క్రోషెటింగ్ నేర్పుతున్న శుభశ్రీ నటరాజన్ జీవన ప్రస్థానం నేటి తరుణిలో....

టి.నగర్, ఆంధ్రజ్యోతి


సంస్థ వర్క్‌షాప్‌లో సభ్యుల సందడి


అల్లికపనుల్లో సంస్థ సభ్యులు


గిన్నిస్ రికార్డ్ రికార్డులతో శుభశ్రీ

# అల్లికలతో 6 గిన్నిస్ రికార్డులు

● ఆదర్శమహిళ, ఔత్సాహిక పారిశ్రామికవేత్త శుభశ్రీ నటరాజన్

చెన్నైకి చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త శుభశ్రీ నటరాజన్ పదహారేళ్ల ప్రాయంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరుండాలని కలలు కంటుండేది. బాల్యం నుండే క్రోషెటింగ్ (దుస్తుల అల్లిక) ఆమె జీవితంలో ఒక భాగంగా మారింది. మదర్ ఇండియా క్రోషెటింగ్ క్వీన్ (ఎంఐసీక్యూ) వ్యవస్థాపకురాలైన తన బామ్మ వద్ద గంటల తరబడి క్రోషెటింగ్, నేయడం, ఎంబ్రాయిడరీ, దుస్తులను డిజైన్ వంటి కళలను ఆసక్తిగా నేర్చుకుంది. తొలినాళ్లలో తయారు చేసిన హస్తకళావస్తువులతో, నవ సమాజాన్ని సృష్టించడానికి శుభశ్రీ కంకణం కట్టుకుంది.నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులను నెలకొల్పిన తర్వాత ఎంఐసీక్యూ ఇటీవల 4517 స్కార్ఫ్ లను తయారు చేసి మరో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టారు.. ఆ తర్వాత వక్షోజ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి అందరి దృష్టి ఆకట్టుకున్నారు..'వక్షోజ క్యాన్సర్ బాధితుల ఆయుష్షు పెంచలేకపోయినా కనీసం వారికి ప్రేమానురాగాలు అందించడం ద్వారా వారి ముఖాలలో చిరునవ్వును తీసుకురాగలిగాం'అని చెబుతున్నప్పుడు శుభశ్రీ ముఖంలో ఆత్మవిశ్వాసం కొట్టొచ్చినట్లు కనిపించింది. మొత్తానికి ఆరు గిన్నిస్ రికార్డులను నెలకొల్పి ఆదర్శ మహిళగా ఖ్యాతినార్జించారు శుభశ్రీ నటరాజన్.

### బామ్మే స్ఫూర్తి...

"మా సొంతూరు కుంభకోణం. ఆ నగరానికి పక్కనే తిరునాగేశ్వరంలో బామ్మ నివసిస్తుండేది. ఆమె వెండితో తయారైన కొక్కి సూది ఉపయోగించి పత్తినూలుతో అల్లికలు చేస్తుండేది. బనియన్లు, టాప్స్ వంటి దుస్తులను అల్లిక ద్వారా తయారు చేస్తుండం చూశాను. పదేళ్లప్రాయంలో బామ్మ ఇంటికి వెళ్ళినప్పుడల్లా ఆమె పత్తినూలుతో అల్లుతుండటం గమనించేదాన్ని. ఓ సారి నవరాత్రి సందర్భంగా ఆమె కొలువు బొమ్మల కొయ్యమెట్లపై పరిచేందుకు అల్లికతో తయారు చేసిన దుప్పటి వాడటం చూసి ఆశ్చర్యపోయాను. అంతే కాకుండా కొలువులో రంగురంగుల దారాలను ఉపయోగించి అల్లిక ద్వారా అందంగా తయారు చేసిన బొమ్మలు కూడా ఉన్నాయి. ఆ నవరాత్రి బొమ్మల కొలువును చూడటానికి వచ్చినవారంతా మా బామ్మను మెచ్చుకోవడం గమనించాను. మనం కూడా బామ్మలా 'క్రోషె' నేర్చుకుని, కళాత్మక దుస్తులు తయారు చేసి అందరి వద్దా మంచి పేరుతెచ్చుకోవాలని అప్పుడే నిర్ణయం తీసుకున్నాను. ఆ అల్లిక నేర్చుకుని ఆరు ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని చూడకుండానే బామ్మ కన్నుమూయటం నాకు ఎంతో బాధేసింది. చదువుతున్నప్పుడే టైలరింగ్, చిత్రలేఖనం, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషిన్ ఎంబ్రాయిడరీ, క్రోచె ఇలా పలు కళలను నేర్చుకున్నారు. తీరిక సమయాల్లో కళాత్మక రూపం తయారు చేయడం హాబీగా పెట్టుకున్నాను.


గిన్నిస్ రికార్డును అందుకుంటున్న శుభశ్రీ నటరాజన్

### క్రోషెటింగ్ ఫర్ ఎ కాజ్...

శుభశ్రీ పట్టుదల, అంకితభావం, స్నేహితుల సహకారంతో 2015లో ఈ అవగాహన ప్రచార కార్యక్రమం కార్యరూపం దాల్చింది. కరపత్రాల పంపిణీ, ఫేస్‌బుక్ పోస్టుల ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద దుప్పటి తయారు చేయడం గురించి ప్రచారం చేశారు. ఆ కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి ఆసక్తికనబరచిన వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. వారందరి ఉద్దేశం ఒక్కటే స్వీయ-అంగీకారం. ప్రతి మహిళా ఒక దుప్పటి అల్లి, మూటలు గట్టి చెన్నై పంపారు. అలా సేకరించిన దుప్పట్లను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌కు రెండు రోజులకు ముందు ఎంఐసీక్యూ సభ్యులంతా కలిసి అల్లి 11,148 చదరపు మీటర్ల పొడవున ఒకే దుప్పటిగా రూపొందించారు. ఆ దుప్పటి 2016 జనవరి 31న చేతిఅల్లికల ద్వారా తయారైన అతిపెద్ద దుప్పటిగా ప్రపంచ రికార్డు సృష్టించింది. ఆ కార్యక్రమం అంతటితో ముగియలేదు. ఆ పెద్దదుప్పటి భాగాలను విడగొట్టి, చిన్న దుప్పట్లుగా మార్చి నిరుపేదలకు, రోటరీ క్లబ్‌లకు, స్వచ్ఛందసంస్థలకు, సామాజిక కార్యకర్తలందరికీ పంచిపెట్టారు. తన మొదటి ప్రాజెక్టు విజయవంతం కావటంతో స్వచ్ఛంద సేవలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నప్పుడు చా లా మంది మహిళలు క్రోషెటింగ్ తమ జీవితాల్లో మార్పు తీసుకువచ్చిందని, మరికొందరు మహిళలు పురుషాధిక్య సంకెళ్లను తెంచుకుని స్వీయసంపాదన మార్గాన్ని ఈ క్రోషింగ్ చూపెట్టిందని వివరించారు. వీరి మాటలు శుభశ్రీలో మార్పు తీసుకువచ్చాయి. ఎప్పటిలాగే క్రోషెటింగ్ కొనసాగింది. ఈ మహిళలంతా కలిసి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు.ఆ మేరకు 2017లో 14.089 కి.మీ. పొడవైన స్కార్ఫ్‌ను అల్లారు. 2018లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రోషెట్ ప్రతిమను రూపొందించి ప్రదర్శించారు. 2019లో 66,158 క్రిస్మస్ బొమ్మలను కూడా అల్లికల ద్వారా రూపొందించి పలువురి ప్రశంసలందుకున్నారు. చెన్నైలో 2016లో సంభవించిన వరదల సమయంలో దుప్పట్లను సేకరించి బాధితులకు పంపిణీ చేయడంలో సవాళ్లను ఎదుర్కొన్నానని, అయితే పోలీసుల సహకారంతో దుప్పట్లును వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు కూడా ఉచితంగా అందజేయడం తనకు ఆత్మసంతృప్తిని కలిగించిందని శుభశ్రీ వివరించారు.

**'క్రోషె' అంటే... :** 'హుక్' అనే కొక్కి కలిగిన సూదితో వస్త్రాలను తయారు చేసే కళ 'క్రోషె'. ఇది ఐదువేల సంవత్సరాలనాటి ప్రాచీన కళ. ఇటలీలో ఆవిర్భవించింది. అప్పటి రాణులు తమ తీరిక వేళల్లో బంగారు నూలు ఉపయోగించి పలు కళాత్మక రూపాలను తయారులు చేసేవారు. ప్రారంభంలో ఈ కళ రాచకుటుంబీకులకు చెందినదిగానే పరిగణించబడింది. రెండువేల సంవత్సరాలకు ముందు ఈ కళ భారతదేశంలో ప్రవేశించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇది జనరంజకమైన కళగా మారింది. పత్తి నూలు, ఆక్రలిక్ యార్న్, కంబళి నూలు, నైలాన్ దారం, అరటి నార ఉపయోగించి ఈ 'కొక్కి అల్లికలు' చేస్తున్నారు.



### మదర్ ఇండియా క్రోషెటింగ్ క్వీన్ ఆరంభం...

చదువులు పూర్తయ్యాక పెళ్ళి చేసుకుని ముంబయికి వెళ్ళిపోయాను. ఆ తర్వాత పిల్లల పెంపకం, వారి చదువులు కుటుంబ బాధ్యతలపైనే దృష్టిసారించాను. పెద్ద కుమార్తె వివాహం జరిగిన తర్వాత కుటుంబ బాధ్యతల బరువు కాస్త తగ్గింది. ఆ సమయంలోనే 'క్రోషె'పై దృష్టిసారించాను. ఈ అల్లికల కళను అందరికి వ్యాపింపజేయాలని 150 మంది మహిళలతో 2015లో మదర్ ఇండియా క్రోషెటింగ్ క్వీన్ పేరుతో సంస్థ ప్రారంభించాను. రెండేళ్ల తర్వాత సభ్యుల సంఖ్య 1500కు పెరిగింది. ప్రస్తుతం అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సహా 13 దేశాలకు చెందిన 2500 మంది మహిళలు సంస్థ సభ్యులుగా ఉన్నారు. వీరందరి సహాయసహకారాల వల్లే సంస్థను ఉన్నతస్థితికి తీసుకురాగలిగాననిచెప్పారు. మహిళంతా కలిసికట్టుగా ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలరనటానికి తమ సంస్థ సభ్యులే చక్కటి ఉదాహరణ" అని శుభశ్రీ నటరాజన్ తరుణితో తన అనుభవాలు పంచుకున్నారు.

## ఆర్యవైశ్య మహిళాసభ ఆధ్వర్యంలో రాజశ్యామలాదేవి పూజలు

ప్యారీస్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆర్యవైశ్య మహిళా సభ (మద్రాసు యూనిట్) ఆధ్వర్యంలో ఆడి తొలి శుక్రవారం సందర్భంగా జార్జిటౌన్ కన్యకాపరమేశ్వరం దేవస్థానం మహామండపంలో రాజశ్యామలాదేవి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళా సభ అధ్యక్షురాలు ప్రశాంతి అధ్యక్షతన దీపపూజ, రాజశ్యామలాదేవిని పుష్పాలతో అలంకరించారు. 200 మంది మహిళలతో ఆలయ అర్చకులు దిలీప్‌కుమార్ పంతులు ఈ పూజలను చేయించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ 1983 నుండి ఆడి మొదటి శుక్రవారం రోజు ఈ పూజలను క్రమం తప్పకుండా జరుపుతున్నట్లు తెలిపారు. పూజల్లో పాల్గొన్నవారికి అష్టోత్తర శతకం పుస్తకాలు అందించినట్లు చెప్పారు. ముందుగా పద్మలత వీణా వాద్య కచేరీ, మహిళా సభ సభ్యుల వాసవీ మాత గీతాలపాన జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో సంస్థ కార్యదర్శి భార్గవి, కోశాధికారి ప్రసన్న లక్ష్మితో పాటు మల్లిక, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళా సభ సభ్యులు



మృతి చెందిన జింక

## అలిపిరి వద్ద కుక్కల దాడిలో జింక మృతి

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): అలిపిరి చెక్‌పాయింట్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున కుక్కల దాడిలో జింక మృతి చెందింది. పొట్ట భాగంలో గాయాలతో మృతి చెంది పడివున్న జింకను చూసి తొలత చిరుత దాడిగా భావించారు. అయితే చిరుత దాడి చేస్తే మెడ భాగాన్ని నోటకరుచుకుని ఆ తర్వాత అడవిలోకి తీసుకెళ్లి తింటుందని, జింక పొట్టపై గాయాన్ని చూస్తే కుక్కలు దాడి చేసినట్టుగా ఉందని అటవీ అధికారులు చెప్పారు. అయినప్పటికీ విజిలెన్స్ అధికారులు భక్తులను అప్రమత్తం చేసి తిరుమలకు పంపారు.

## పాత భవనాలు సిద్ధం చేయండి

● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, జూలై18(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాత భవనాలను తగిన రిపేర్లతో ఉపయోగంలోకి తీసుకురావాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్ భవనాన్ని శుక్రవారం ఉదయం అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి ఈవో పరిశీలించారు. హెచ్‌వీడీసీ, బాలాజీ నిలయం, తిరుమల మందిరం(ఆంప్రో రెస్ట్ హౌస్) విశ్రాంతి భవనాలను కూడా పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, డిప్యూటీ ఈవో భాస్కర్, రెవిన్యూ డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు ఈవో వెంట ఉన్నారు.

## తిరుమలలో నటి ప్రగ్యానయాన్

తిరుమల, జూలై18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీనటి ప్రగ్యా నయాన్, ఎంహెచ్‌సీ ప్లాంటేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్ కింగ్ థిన్, ఎమ్మెల్యేలు ఆదిమూలం, బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు.




## సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ దాకా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.3.66 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,897**

**తలనీలాలు సమర్పించినవారు: 29,500**





## శభాశ్.. హరీశ్..!

● పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన



హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయింట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. అనంతపురం జిల్లా గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుండా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● రూ.67లక్షల విత్తనాలు, పురుగు మందుల సీజ్



ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పురుగు మందుల పరిశీలన

వెంకటగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు హెచ్చరించారు. శుక్రవారం వెంకటగిరి డివిజన్ పరిధిలోని పలు దుకాణాల్లో ఆయన బృందం తనిఖీలు నిర్వహించింది. రైతులు తీసుకున్న ప్రతి వస్తువుకూ బిల్లు ఇవ్వడంతో పాటు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో నమోదు చేయనందున రూ.21,99,979 విలువ గల ఎరువులు, రూ.45,19,240 పురుగు మందుల అమ్మకాలు నిలిపేశామన్నారు. ఓ రవాణా ట్రాన్స్‌పోర్టు కార్యాలయలో తనిఖీలు నిర్వహించి ఎటువంటి ఆధారాలు లేకుండా వచ్చిన పురుగు మందులు, విత్తనాలు పరిశీలించారు. నందాల, ఆంజనేయ, అనసూయ, ఏవో సుజాత, ప్రవీణ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

● రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో

## వైసీపీ నేతను తప్పించేందుకు పైరవీలు

నాయుడుపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో వైసీపీ నేతను తప్పించేందుకు ఆ పార్టీ నాయకులు జోరుగా పైరవీలు చేస్తున్నారు. ఈనెల 3వ తేదీ నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద శ్రీకాళహస్తి నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న 403 బస్తాల రేషన్ బియ్యాన్ని అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ గజేంద్రతో రేషన్ బియ్యం తరలింపులో వైసీపీ నాయకుడు పాత్ర ఉన్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో సూళ్లూరుపేటకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో మంతనాలు ప్రారంభించారు. ఎలాగైనా కేసు నుంచి వైసీపీ నాయకుడిని తప్పించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

## ఇద్దరు ఏపీపీల పదవీకాలం రద్దు

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఏపీపీల పదవీ కాలాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. తిరుపతి అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు 2020 సెప్టెంబరు 9న న్యాయవాది సీహెచ్ శ్రీదేవి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఆమె మూడేళ్ల పదవీ కాలం 2023 సెప్టెంబరులో ముగిసినా.. అదే ఏడాది నవంబరు నుంచీ కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, శ్రీకాళహస్తి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు గతేడాది మార్చి 15న న్యాయవాది సి.వీరరాఘవరెడ్డి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వీరిద్దరి పదవీ కాలాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వారి పదవీ కాలాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

● భర్త బావిలో తోసి చంపిన ఘటనలో

## భార్యా బిడ్డలకు అంత్యక్రియలు పూర్తి

తలారివారిపల్లిలో అలుముకున్న విషాదఛాయలు



తల్లారివారిపల్లిలో బిడ్డల సహా హేమంతకుమారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా పాకాల మండలం మద్దినాయనిపల్లి పంచాయతీ పెద్దూరు హరిజనవాడకు చెందిన హేమంతకుమారి (35), ఇద్దరు బిడ్డలు తనుశ్రీ(11), తేజశ్రీ (8)లకు శుక్రవారం రాత్రి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లిలో అంత్యక్రియలు పూర్తిచేశారు. గురువారం మధ్యాహ్నం బంధువుల ఇంటికెళ్దామంటూ ద్విచక్రవాహనంపై భార్య, ఇద్దరు బిడ్డలను తీసుకెళ్లిన గిరి.. కోనేబోయిన ఇండ్లు సమీపంలోని బావిలో తోసేయడంతో ఆ ముగ్గురు మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుపతి రుయాస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించాక హేమంతకుమారి పుట్టిల్లయిన తలారివారిపల్లికు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లీబిడ్డల మృతదేహాలను ఒక్క సారిగా చూసిన గ్రామస్తులు బోరున విలపించారు. దీంతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.



# పద్మవ్యూహంలా కపిలతీర్థం

● ట్రాఫిక్ కష్టాలు
● సీఎం గారూ మీరైనా దృష్టిపెట్టండి

తిరుపతి- ఆంధ్రజ్యోతి

అత్యంత పవిత్రమైన శైవక్షేత్రంగా తిరుపతిలోని కపిలతీర్థం ప్రసిద్ధి చెందుతోంది. కొండమీద నుంచి దూకే జలపాతం, విశాలమైన పుష్కరిణి, మండపాలతో కూడిన ఈ తీర్థం.. స్థానికులకే కాక, తిరుమలకు వచ్చిపోయే భక్తులనూ ఆకర్షిస్తోంది. వాహనాల్లో ప్రయాణించేవారు అక్కడ ఆగి కపిలేశ్వరుని దర్శించుకుని వెళ్తుంటారు. దీంతో నంది కూడలి అత్యంత రద్దీ ప్రాంతంగా మారిపోయింది. ట్రాఫిక్ జాం అన్నది ఇక్కడ సాధారణ విషయం అయ్యింది. సోమవారం రోజుల్లో అయితే ఈ సర్కిల్ దాటడం పెద్ద సమస్యగా మారుతోంది. దీనికి తోడు ఈ కూడలిలో తిరుపతి కార్పొరేషన్ పిలిగ్రిమ్ ఎమినిటీస్ సెంటర్ పేరుతో నిర్మించిన వాణిజ్యభవనం వద్ద నిలిచి పోయే వాహనాలతో మరింత గందరగోళం ఏర్పడుతోంది. నిబంధనలు పాటించని భవనాలపై చర్యలు తీసుకోవాల్సిన కార్పొరేషనే ఏకంగా ఏ నిబంధనలూ పాటించకుండా ఈ భవనాన్ని నిర్మించడం విచిత్రం. వైసీపీ పెద్దల అండదండలతో అప్పట్లో కోరినట్టు ఆ పార్టీ నేతలు నిర్మించుకున్న ఈ భవనం ఇప్పటికీ ఇదే తీరులో నడుస్తోంది. ట్రాఫిక్ కు మరింత ఇబ్బందిగా మారింది. నేడు కపిలతీర్థంను సందర్శిస్తున్న సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి పెట్టాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు.

### నందిసర్కిల్ వరకు గరుడవారధి

గరుడ వారధి తొలుత అనుకున్న ప్రకారం నంది సర్కిల్ వరకు నిర్మించి ఉంటే ట్రాఫిక్‌కు పెద్ద అంతరాయం కలిగివుండదు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని కుదించేసింది. అలిపిరి పోలీస్ స్టేషన్ వరకే పరిమితం చేసింది. పైగా రూ220 కోట్ల బడ్జెట్‌తో అలిపిరి దాకా పొడిగిస్తామంటూ అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏకండి డిజైన్ కూడా సిద్ధం చేయించారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. తొలి ప్లానింగ్ ప్రకారం కపిలతీర్థం దాటి మలుపు తిరిగేదాకా గరుడవారధిని పొడిగిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.

### కాలువలు కబ్జా

కొండమీద జల్లున పెద్ద వాన కురిస్తే చాలు కపిలతీర్థం, మాలాడగుండం జలపాతాలు ఉరకలేస్తూ దూకుతాయి. ఈ నీళ్లన్నీ వ్యర్థమవుతూ ఉంటాయి. అనేక చోట్ల ఆక్రమణలకు గురైపోయి ఇవి కుదించుకుపోయాయి. డ్రైనేజీతో కలిసిపోయి మురుగుకాలువలుగా ఈ రెండు కాలువలూ మారిపోయాయి. కపిలతీర్థం కాలువ అడుగున సిమెంటు లైనింగ్ వేసేయడంతో భూమిలోకి నీరు ఇంకకుండా జారిపోతోంది. ఇందువల్ల కాలువ తీర ప్రాంతాల్లోని భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. సిమెంట్ లైనింగ్ తొలగించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకోవడంలేదు.

### కరకంబాడి - కపిలతీర్థం రోడ్డు ఏమైంది?

ఇక కపిలతీర్థం నుంచి కరకంబాడి వరకు గతంలో ప్రతిపాదించిన మార్గం ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు. అటవీ అనుమతుల్లో జరుగుతున్న జాప్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈరోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే తిరుపతి నగరం మీద ట్రాఫిక్ ఒత్తిడి చాలా వరకూ తగ్గుతుంది.

## ఎక్కడా ఏమరపాటు వద్దు

● సీఎం పర్యటనలో అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏమాత్రం ఏమరపాటు లేకుండా విధులు నిర్వహించాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం పోలీసు పరేడ్ మైదానంలో బందోబస్తు విధులు కేటాయించి మాట్లాడారు. చంద్రబాబు పర్యటించే అన్ని చోట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రశాంత వాతావరణంలో పర్యటన సాగేలా చూడాలన్నారు. ప్రతి పోలీసు వారికి కేటాయించిన స్థలాలకు శుక్రవారం సాయంత్రం చేరుకుని విధుల్లో నిమగ్నం కావాలన్నారు. ఇప్పటికే పోలీసు శాఖ రిహార్సిల్స్ నిర్వహించింది. ఎవరైనా సీఎం పర్యటనను అడ్డుకునేలా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో అనుమానితులు దాదాపు 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆరు గంటల పాటు తిరుపతిలో సాగనున్న సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం కాన్వాయ్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ, రిజర్వు బలగాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కె.రవిమనోహరచారి, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

**బందోబస్తు ఇలా**

నలుగురు అదనపు ఎస్పీలు, పది మంది డీఎస్పీలు, 41 మంది సీఐలు, 73 మంది ఎస్ఐ లు, 288 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 490 మంది కానిస్టేబుళ్లు, 86 మంది మహిళా కానిస్టేబుళ్లు, 153 మంది హోం గార్డులు.. మొత్తం 1149మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారు. వీరికి విధులు కేటాయించారు.

## 'ప్రజా వేదిక'కు సర్వం సిద్ధం

● వర్షం వచ్చినా తడవకుండా 2500 మందికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అనగాని, కలెక్టర్ తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పోలీసు పరేడ్ మైదానంలో శనివారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబు నిర్వహించే ప్రజావేదికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పీ4 కార్యక్రమం కింద దాతలుగా ముందుకు వచ్చిన మార్గదర్శులు, వారు దత్తత తీసుకునే బంగారు కుటుంబాలతో ముఖాముఖి సమావేశమవుతారు. ఈ కార్యక్రమంలో దాదాపు 2500 మంది పాల్గొంటున్నారు. భారీ వర్షం వచ్చినా తడవకుండా ఉండేలా రెయిన్ ప్రూఫ్ జర్మనీ టెంట్లు వేశారు. అక్కడే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కింద ఆరు స్టాళ్లు ఏర్పాటు చేశారు. వచ్చిన వాళ్లందికీ తాగునీరు, బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. మార్గదర్శుల్లో కొందరిని సీఎం సన్మానించనున్నారు. దాదాపు 1.45 గంటలపాటు జరగనున్న కార్యక్రమానికి సంబంధించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎం కార్యక్రమాల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కూటమి నాయకులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధనరాజు,కమిషనరు మౌర్య, ఆర్డీవో రామ్మోహన్‌రావు, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా అధికారులు పరిశీలించారు.





## చంద్రగిరి ఎమ్మెల్యే నానికి మాతృవియోగం

● పలువురు నాయకుల నివాళి

పాకాల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం కలిగింది. చిత్తూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం నాని తల్లి లక్ష్మీభారతి(80) కన్నుమూశారు. కొద్దికాలంగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. పాకాల మండలం పులివర్తివారిపల్లెలో ఆమె పార్థివ దేహానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరిలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, గాలి భానుప్రకాష్, డాక్టర్ మురళీమోహన్, ఆరణి శ్రీనివాసులు, థామస్, తుడా చెర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు, చంద్రగిరి ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, కిరణ్ రాయల్, సీకే లావణ్య, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నాని కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తన తల్లి అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పులివర్తివారిపల్లెలో జరుగుతాయని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు.

లక్ష్మీభారతి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు, (ఇన్‌సెట్లో) లక్ష్మీభారతి ఫైల్ ఫొటో

## విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

● అధికారులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), జూలై18(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో గృహ వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామికవేత్తలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని సంస్థ సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తిరుపతిలోని అనెక్స్ భవనంలోని సమావేశ మందిరంలో అన్ని జిల్లాల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో వేగం పెంచాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు మెరుగుపరచాలని సూచించారు. పొలాల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆదేశించారు. పెండింగ్ వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరఫరాలో అంతరాయం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కి లేదా 1800 425155333, 9133331912లకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, సీజీఎంలు జె.రమణాదేవి, కె.ఆర్.ఎస్.ధర్మజ్ఞాని, డీఎస్ వరకుమార్, పి.హెచ్.జానకిరామ్, ఆదిశేషయ్య, శోభావాలంటీనా, కె.రామమోహన్‌రావు, పి.మురళి, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, నీలం నరేంద్రనాథ్, శ్రీనివాసులు, సురేంద్రనాథ్, మురళి, చక్రపాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## స్మార్ట్ ఉపగ్రహ తయారీ వర్క్‌షాప్



స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు



మంగళం, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో చెన్నైకి చెందిన స్పేస్ కిడ్ ఇండియా వారి సహకారంతో శుక్రవారం విద్యార్థులకు స్మార్ట్ ఉపగ్రహ తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. 23 పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్మార్ట్ ఉపగ్రహాలు తయారు చేశారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ అపోలో లావెల్ మిషన్ ద్వారా మనుషులు మొదటిసారి చంద్రుడిపైకి అడుగు పెట్టారన్నారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుటూ వారం రోజులు విద్యార్థులకు ఉపగ్రహంపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్పేస్ కిడ్ ఇండియా ప్రాజెక్టు ఇన్‌ఛార్జి యజ్ఞసాయి ఉపగ్రహం తయారీ, పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్‌సెంటర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, స్పేస్ కిడ్ ఇండియా మేనేజరు హాసిక పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై మహిళా కమిషన్‌కు రోజా ఫిర్యాదు

పుత్తూరు,జూలై18(ఆంధ్రజ్యోతి): తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ పలు సందర్భాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి రోజా రాష్ట్ర మహిళా కమిషన్‌కు శుక్రవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. భాను చేసిన వ్యాఖ్యలను ఉటంకించారు. ఎమ్మెల్యే పదవిలో ఉండీ, ఇలా మాట్లాడుతున్న భానుప్రకాష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని తొలగించాలంటూ ఫిర్యాదు



చర్చిలో కన్నిగ (ఓంకార్ విడుదల చేసిన చిత్రమిది)

తిరుమల, జూలై18( ఆంధ్రజ్యోతి): టీటీడీలో క్రైస్తవ ఉద్యోగిని కన్నిగను తక్షణమే విధుల నుంచి తొలగించాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి స్టేట్ ప్రెసిడెంట్ తుమ్మా ఓంకార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ విద్యుత్ విభాగం ఏఈఈ కన్నిగ ప్రతి ఆదివారం ఎస్వీ నగర్ చర్చిలో బైబిల్ తరగతులు చెబుతున్నారంటూ, ఆమె ప్రార్థన చేసిన వీడియోతో శుక్రవారం టీటీడీ ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. ప్రతి ఆదివారం చర్చిలో బైబిల్ క్లాసులు బోధిస్తున్న వీడియోను 2019లోనే టీటీడీకి అందజేసినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, శాశ్వతంగా టీటీడీ నుంచి బహిష్కరించాలని డిమాండు చేశారు. ఈ మేరకు ఆమె చర్చిలో ఉన్న ఫొటోనూ ఓంకార్ విడుదల చేశారు.